క్లుప్తంగా

రేపు శని త్రయోదశి పూజలు



మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారు మంగరాయ కాలనీలో వెలసిన మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం శని త్రయోదశి సందర్భంగా శని దోష పరిహార పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసు దేవరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు అర్ధాష్టమ, అష్టమ ఏలినాటి శని దోషంతో ఇబ్బందులు పడుతున్న వారికి పరిహార పూజలు చేస్తున్నట్లు చెప్పారు. శనీశ్వర స్వామికి ఉదయం తైలాభిషేకం, మృత్యుంజయ హోమం జరిపిస్తామన్నారు. వేకువ జామున స్వామికి పంచామృతభిషేకం, వెండి పూల అలంకరణ నైవేద్యం సమర్పణ, మహా మంగళహారతులు ఉంటాయని పేర్కొన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



ఫాతెహాల్‌లో పాల్గొన్న భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలి వచ్చి ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

వాటర్ కూలర్ విరాళం



వాటర్ కూలర్ అందజేసిన దాతలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి పత్తికొండ పట్టణానికి చెందిన శ్రీనివాసులు, మాణిక్యాంబ, మదనగోపాల్ కవిత కుటుంబ సభ్యులు రూ. 50 వేల విలువైన వాటర్‌కూలర్‌ను అందజేయగా నిత్యాన్నదాన కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్. వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రం, బాండు అందజేశారు. అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం ఉత్తర రాజగోపురం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు డీసీ చెప్పారు. ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

ఎస్ఈకి ఘనంగా వీడ్కోలు



సుధాకర్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆదోని ఇన్‌చార్జ్ డీఈ, ఏడీఈలు

ఆదోనిఅర్బన్: పట్టణంలో విద్యుత్‌శాఖలో డీఈగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ కుమార్ ఎస్ఈగా పదోన్నతిపై తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయనకు గురువారం విద్యుత్‌శాఖ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక అర్దగేరి బస్టాండు వద్దనున్న కల్యాణ మండపంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ఏడీఈలు, ఆదోని ఇన్‌చార్జ్ డీఈ రాజేష్ పాల్గొని ఆయనకు శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. డీఈ రాజేష్ మాట్లాడుతూ సుధాకర్‌కుమార్ సేవలను కొనియాడారు. ఏడీఈ పురుషోత్తం, ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీలో క్యాంపస్ నియామకాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో క్యాంపస్ నియామకాలు జరిగినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరన్న గురువారం తెలిపారు. బెంగళూరుకు చెందిన టీఏపీ అకాడమీ వారు బీటెక్ చివరి సంవత్సరం చదవుతున్న ఈసీఈ, సీఎస్ఈ, ఎంఈసీ బ్రాంచ్‌లకు చెందిన 10 మంది విద్యార్థులనుసాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్‌గా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఫాతెహాల్



ఎల్లార్తి దర్గాలను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు

- జిల్లా కలెక్టర్ జి.సృజన, ఎస్పీ కృష్ణకాంత్



కపటి గ్రామంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

ఆదోని అర్బన్: ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు హక్కు.. ఆ ఆయుధాన్ని ప్రజలందరూ కచ్చితంగా వినియోగించుకొని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరే ముఖ్యం అనే విషయాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుంచి కోట్ల కూడలి వరకు స్వీప్ ఓటు హక్కు అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరఫున ఓటు హక్కు వినియోగించుకోవడం, ఓటు ప్రాముఖ్యతను ఆదోని ప్రజలందరికీ తెలియచేయడమే ర్యాలీ ముఖ్యఉద్దేశమన్నారు. ఓటు వేయడం ప్రజలందరి బాధ్యత అని, ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించడం తమ బాధ్యత అన్నారు. భయం పోగొట్టడానికే తమతో పాటు భద్రతా దళాలతో ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. మీ ఓటు హక్కు ఉందో లేదో చూసుకోవాలని, లేకపోతే ఏప్రిల్ 15వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ మే 13న ఎన్నికలు జరగనున్నాయని, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. భద్రత పరంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను తీసుకుంటామని తెలిపారు. ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

రెడ్డీస్ హాల్‌లో...

పట్టణంలోని రెడ్డీస్ హాల్‌లో సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణపై బూత్ స్థాయి, సెక్టోరియల్ అధికారులకు, ఎంసీసీ బృందాలకు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ పాల్గొని అవగాహన కల్పించారు. అలాగే.. స్థానిక వాల్మీకి నగర్‌లోని జీవేశ్వర పాఠశాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్ర ఆవరణలో గ్రామ సభ నిర్వహించి గ్రామస్తులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆదోని మండలంలో సమస్యాత్మక ప్రాంతమైన కపటి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ఓటు హక్కును శాంతియుతంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్



సమావేశంలో పాల్గొన్న బూత్ లెవెల్ అధికారులు

మంత్రాలయం: కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం మంత్రాలయంలోని టీటీడీ కల్యాణ మంటపంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణపై బూత్ లెవెల్, సెక్టోరియల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో కలెక్టర్, ఎస్పీ పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలోని సమస్యాత్మక 57, 58 బూత్‌లను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆర్వో మురళీధర్, సీఐ ప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నాగశివలీల

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు. గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నీ ఓటు.. నీ భవిత అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు వేయడానికి అర్హులన్నారు. ఎవరికైనా ఓటు లేకపోతే దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వ తేదీ వరకు సమయం ఉందని, వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్, విశ్వనాథ్, మెప్మా మేనేజర్ సమీనా బాను, సీఎంఎం వీరారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, జగనన్న పాలన చూశారని, ఇంతటి సంక్షేమాభివృద్ధి ఇంతకుముందెన్నడూ లేదని, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, యువ నాయకుడు దాట్ల సుబ్బారాజు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రతి కుటుంబానికి అందిన పథకాల లబ్ధిని వివరించి మరోసారి గెలిపిస్తే మరింత సంక్షేమాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. జేకేఎల్ఎస్ నగర్, హనుమస్‌నగర్, వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. సర్పంచ్ పాల్‌దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, రాఘవేంద్రరెడ్డి, వడ్డెరాము, వార్డు మెంబర్లు మోదీన్, ఉలిగప్ప పాల్గొన్నారు.

నాడు అలా.. నేడు ఇలా



నాడు గుంతల మయంగా డి.బెళగల్ రోడ్డు



నేడు తారు రోడ్డు వేసిన దృశ్యం

కోసిగి: మండలంలోని డి.బెళగల్ గ్రామం రచ్చుమర్రి వరకు 6 కి.మీ. రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక పోయింది. హై ఇంపాక్ట్ రోడ్డు కింద రూ.2.50 కోట్ల బడ్జెట్‌తో జనవరి 27న మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పనులు వేగంగా పూర్తి చేశారు. డబుల్ రోడ్డు వేయడంతో వాహనాలు రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. అవస్థలు తప్పడంతో ప్రయాణికులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ వేలాలు వాయిదా

కోసిగి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన వారపు సంత మార్కెట్, బండిమెట్ట, చిన్న కమేళా, పెద్ద కమేళాలకు సంబంధించిన బహిరంగ వేలాలను ఎన్నికల కోడ్ నిమిత్తం వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ కుమారి అయ్యమ్మ, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలాలను స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నేడు బహిరంగంగా నిర్వహించాల్సి ఉందని, అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కోడ్ ముగిసేంత వరకు వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. తదుపరి నిర్వహించే తేదీని తెలియజేస్తామని పేర్కొన్నారు.

బాలిక మృతి

మంత్రాలయం : మండలంలోని చెట్నెహల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక, అదే గ్రామానికి చెందిన బెస్త శివ అనే యువకుడు మంగళవారం కోసిగి గ్రామ సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన విషయం తెలిసిందే. కర్నూలులో చికిత్స పొందుతూ సదరు బాలిక తనువు చాలించింది. గురువారం గ్రామంలో బాలిక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇద్దరూ ఇష్టపడటంతో పెళ్లికి పెద్దలు ఒప్పుకోరనే ఆందోళనతో పురుగుమందు సేవించారు. ప్రస్తుతం బెస్త శివ చికిత్స పొందుతున్నాడు.

రేపు రేణుకాచార్యుల జయంతి

ఆదోని అర్బన్: కర్నూలు జిల్లా పరిషత్ ఆవరణలో నున్న ఓంకారేశ్వర దేవాలయంలో కర్నూల్ జిల్లా జంగమ సంక్షేమ సంఘం కర్నూల్ టౌన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రేణుకాచార్యుల 23వ జయంతి నిర్వహిస్తామని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వేశ్వరయ్య, బసవరాజ్ స్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వీరశైవులు హాజరు కావాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వై.ప్రదీప్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

పెద్దకడబూరు : మండలంలోని నాగులాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ యూత్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన రామాంజనేయులు, పెద్ద నల్లారెడ్డి, చిన్న నల్లారెడ్డి, నాగయ్య, గురుజాల ఈరన్న, ఓబులేసు, రంగన్న, హనుమంతుతో పాటు మరి కొందరు ఎమ్మిగనూరు పట్టణంలోని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి స్వగృహంలో పార్టీలో చేరగా వారికి వై.ప్రదీప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల కంటే అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి



డిప్యూటీ ఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ ఈఓ వెంకటరమణరెడ్డిని కలిసి వినత పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గుండె, ఊపిరితిత్తులు, మానసిక జబ్బులు, దివ్యాంగులు, 60సంవత్సరాల పైబడిన వారికి, చంటిబిడ్డల తల్లులకు మినహాయింపునివ్వాలన్నారు. రాష్ట్ర కౌన్సిర్ వీర చంద్రయాదవ్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో ఇన్విజిలేటర్లకు, స్పాట్ వాల్యువేషన్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు పారితోషికం పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రవీణ్, భీమ్‌రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



పరమాన్ దొడ్డి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణమూర్తి

మంత్రాలయం : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి కోరారు. గురువారం పరమాన్ దొడ్డి , సోళహల్లి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో గొడవలకు పాల్పడవద్దని, అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రమణీయం...తాతల రథోత్సవం



పెద్దహోతూరులో భక్తుల నడుమ రథోత్సవం లాగుతున్న దృశ్యం



ప్రత్యేక పూజలందుకుంటున్న హుచ్చువీరప్ప తాత

ఆలూరు రూరల్: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువైన హుచ్చు వీరప్ప, మరకట్టు గ్రామంలోని సలువప్ప తాత రథోత్సవం గురువారం రమణీయంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల ప్రజలతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తుల పెద్ద ఎత్తున తరలివచ్చారు. రథంపై ఉన్న కలశానికి ఫలాలను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా పెద్దహోతూరు గ్రామం జనసంద్రంగా మారింది. మరకట్టు గ్రామంలో కొలువైన సలువప్పతాత ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు ఉదయం వేద మంత్రోచ్ఛరణలతో పెద్దహోతూరు గ్రామానికి చేర్చారు. సాయంత్రం హుచ్చు వీరప్ప, సలువప్ప ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి రథంపై చేర్చారు. సాయంత్రం వేలాది భక్తులు మధ్య ఎదరు బసవన్న విగ్రహం వరకు రథాన్ని లాగారు. అంతకుముందు ఆలయ అర్చకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో స్వామికి కుంకుమార్చన, జలాభిషేకం , మహామంగళ హారతి, గంగి పూజ వంటి తదతర పూజలు నిర్వహించారు. పెద్దహోతూరు గ్రామంలో ప్రతి ఏటా కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఆలయాన్ని సందర్శించిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచి పెట్టారు. ఉత్సవం సందర్భంగా గ్రామానికి వచ్చే భక్తుల కోసం ఉచితంగా ఆటోలతో రవాణా సౌకర్యం కల్పించారు. రథోత్సవానికి తిలకించేందుకు వెళ్లే భక్తుల కోసం ఆలూరు పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఉచితంగా మజ్జిగ, మంచి నీళ్లను పంపిణీ చేశారు. ఆలూరు సీఐ వెంకటే శ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ ఓబులేసు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

న్యాయవాదుల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఆలూరు రూరల్: ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు బార్ అండ్ అసోసియేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు న్యాయవాదుల ఎన్నికల అధికారి సిద్దప్ప గురువారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకు నామినేషన్ల స్వీకరణ, 26వ తేదీన మధ్యాహ్నం 12.30 లోపు స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 10 నుంచి 2 గంటల వరకు పోలింగ్, అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్, లైబ్రేరియన్ పోస్టులకు అభ్యర్థులు పోటీ చేయవచ్చన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన మల్లికార్జున

ఆదోని సెంట్రల్: పట్టణంలోని కొడల్‌పేటలో మల్లికార్జున (37) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మల్లికార్జున ఈనెల 18న 11.30 గంటల ప్రాంతంలో ప్లాట్ ఫామ్ నంబర్.1 నుంచి ప్లాట్ ఫామ్ నంబర్.4 లో ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కడానికి నడకదారిలో వెళ్తుండగా ప్లాట్ ఫామ్ నంబర్.2లో గుర్తు తెలియని గూడ్స్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడని చెప్పారు. మృతుడి ఆధార్‌ను పరిశీలించగా.. తల్లి లక్ష్మీ, తండ్రి రాజప్ప స్వగ్రామం యాదగిరి టౌన్, కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా తెలుస్తుందని వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దొంగల అరెస్టు

ఆదోని అర్బన్: స్థానిక మున్సిపాల్ క్రీడా మైదానం వద్ద దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను టూ టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ గోపిచంద్ మాట్లాడుతూ పట్టణంలోని రోషన్ లాడ్జీకి ఎదురుగా ఉన్న వెంకటేశ్వర టీషాపు దగ్గర తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఇద్దరు పిక్ పాకెటర్స్ అమాసశ్రీను, మునిరాజాను రెండు రోజుల క్రితం స్థానిక మున్సిపాల్‌స్కూల్ గ్రౌండ్ సమీపంలో జేబులు కొల్లగొట్టిన నేరంలో అరెస్టు చేసి వారి నుంచి రూ.38వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వన్‌టౌన్ సీఐ తేజామూర్తి, టూటౌన్ ఎస్ఐ తిరుపాల్ పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆకుపందిరి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు భక్తుల మధ్య గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆకుపందిళ్ల బండ్లను ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విష్వక్సేన పూజలు చేసిన అనంతరం కలశస్థాపన, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజ సంభానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ధ్వజా రోహణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సతీసమేతుడైన గనాథుడు పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉత్సవాలలో ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మలికార్జున తదితరులు పాల్గొన్నారు.